APTEL/25/A2326

# ప్రజలకి చేరువ
సామాన్యుడి ఆయుధం



పంపుటి : 1 | సంచిక : 21 | ఒంగోలు | మంగళవారం 23-9-2025 | ఎడిటర్ : కుమార్ | పబ్లిషర్ : నరాల మురళీ | పేజీలు : 4 | వెల : రూ. 4/-

Ongole I Srikakulam I Vizianagarm I Visakhapatnam I Rajahmundry I Kakinada I Elugu I Vijayawada I Guntur I Kurnool I Kadapa I Chittore I Warangal I Srikakulam I Hyderabad I Mehabubanagar

## స్వదేశీ ఉత్పత్తులే కొనండి- అమ్మండి- వినియోగించండి

### జీఎస్టీ వల్ల సేవింగ్స్ పెరుగుతాయ్‌అందువల్ల సమాజంలోని ప్రతి వర్గం ప్రయోజనం పొందుతుంది: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** జీఎస్టీ సంస్కరణలు పొదుపు పెంచుతాయని, దీని వల్ల సమాజంలోని ప్రతి వర్గానికి ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ అనే సమిష్టి లక్ష్యాన్ని సాధించడానికి, స్వావలంబన మార్గంలో నడవడం తప్పనిసరి అని ఆయన నొక్కి చెప్పారు. ఎక్స్ వేదికగా భారతీయులు అందరికీ ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. అందులో దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 22 మిగతా 2లో

## 2026 నాటికి భారత్‌కు ఎస్-400 డెలివరీ పూర్తి చేస్తాం: రష్యా

### ఇప్పటికే నాలుగు రక్షణ వ్యవస్థలను అప్పగింత- చివరిది వచ్చే ఏడాదికి పూర్తి!



**రష్యా :** భారత్‌కు అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400ల డెలివరీలను వచ్చే ఏడాది పూర్తి చేయనున్నట్లు రష్యా వెల్లడించింది. 2018లో రూ.40 వేల కోట్లతో కుదిరిన ఒప్పందాన్ని 2026 నాటికి పూర్తి చేయనున్నట్లు కథనాలు తెలిపాయి. "2026 నాటికి భారత్‌తో కుదుర్చుకున్న 5 ఎస్-400 రక్షణ వ్యవస్థల కాంట్రాక్టును పూర్తి చేస్తాం. ఇప్పటికే నాలుగు రక్షణ వ్యవస్థలను అప్పగించగా, చివరిది వచ్చే ఏడాదికి పూర్తి చేస్తాం" అని రక్షణ వర్గాలు తెలిపాయి. కాగా, ఐదు ఎస్-400 ట్రయంఫ్ మిగతా 2లో

## బీజేపీ మళ్లీ జమిలి జపం




### అవగాహన కల్పించడమే.. ప్రజల పన్నులతో ఎన్నికలు

**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** జమిలి ఎన్నికలు బీజేపీ అజెండాలో ఉంది. దానికి సరైన సమయం కోసం మాత్రమే కుదరాల్సి ఉంది. నిజానికి 2024 ఎన్నికల్లో బీజేపీ కోరుకున్నట్లుగా 400 ప్లస్ ఎంపీ సీట్లు కనుక వచ్చి ఉంటే ఈపాటికి జమిలి విషయంలో చాలా దూకుడుగా ముందుకు సాగేది. అయినా సరే ఇపుడు కూడా జమిలి జపం అయితే బీజేపీ వీడడం లేదు. జమిలి ఎన్నికల వల్ల లాభం ఏమిటో జనాలకు వివరించే ప్రయత్నం చేస్తూ ఏదో రోజుల ఆ విధానం దేశంలో అమలు చేయాలని చూస్తోంది.

**అవగాహన కల్పించడమే :** జమిలి ఎన్నికల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు బీజేపీ తమ పార్టీ ఎంపీతో దేశంలో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మేధావులతో చర్చా గోష్టులు పెడుతోంది. ఈ క్రమంలో కేంద్ర మాజీ మంత్రి దివగంత నాయకురాలు సుష్మా స్వరాజ్ కుమార్తె ఎంపీ అయిన బాన్సూరి స్వరాజ్ రాజమండ్రిలో జరిగిన వన్ నేషన్ వన్ ఎలక్షన్ సదస్సులో పాల్గొన్నారు. ఆమె జమిలి ఎన్నికల మిగతా 2లో

## ఆర్‌జేడీలో చేరే ప్రసక్తే లేదు

### లాలూ ప్రసాద్ కుమారుడి ప్రమాణం..
### వార్తలపై స్పందించిన లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య




**పాట్నా :** ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు, బహిష్కృత నేత తేజ్ ప్రతాప్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇక ఆర్‌జేడీలో తిరిగి చేరనని ప్రమాణం చేశారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తిరిగి పార్టీలో చేరాతారనని ప్రశ్నించగా ఈ వ్యాఖ్యలు చేశారు. సామాజిక న్యాయం తన లక్ష్యమని తెలిపారు. నేను ఆర్‌జేడీలో తిరిగి చేరనని ప్రమాణం చేస్తున్నాను. గీతా, కృష్ణుడిపైనా ప్రమాణం చేస్తున్నాను. ఎవరైనా పిలిచినా సరే నేను మళ్లీ వెళ్లను. కానీ నా తల్లిదండ్రులు నాకు దేవుళ్లతో సమానం. వారి ఫొటోలను ఎప్పుడూ నా వద్దే పెట్టుకుంటాను. వారెప్పుడు నా గుండెలోనే ఉంటారు. ఇప్పుడు నా మార్గం మారింది. బిహార్‌లో సామాజిక న్యాయం అందడమే నా లక్ష్యం. నా పని గురించి ఇతరలు చెప్పాల్సిన అవసరం లేదు. తేజస్వీ యాదవ్ నా తమ్ముడు. ఆయనకు నా ఆశీర్వాదాలు ఎప్పుడూ ఉంటాయి. ఆర్‌జేడీ నుంచి బహిష్కరణకు గురైన తేజ్ మిగతా 2లో

### జగన్ ! సింహం సింగిల్ అన్నారు... కానీ

## ఇంత పిరికి వాడివా..!

### జగన్ అసెంబ్లీకి రాకపోవడంపై మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా
### డిప్యూటీ సీఎం పవన్‌తో మంత్రి లోకేశ్ భేటీ - రాజకీయ అంశాలపై చర్చ



**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** అసెంబ్లీకి రావట్లేదంటేనే జగన్ ఎంత పిరికివాడో అర్థమవుతోందని మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా చివరి రోజు వరకూ అసెంబ్లీలో పోరాడామని గుర్తుచేశారు. చంద్రబాబు అసెంబ్లీని ఏ సందర్భంలో వదిలారో వీడియో రికార్డులతో సహా ప్రజలంతా చూశారన్నారు. అసెంబ్లీలో తెలుగుదేశం ఎమ్మెల్యేలు అందరినీ సస్పెండ్ చేసినా చంద్రబాబు ఒక్కరే తన వాదన వినిపించి ప్రజా సమస్యలపై పోరాడారని చెప్పారు. అసెంబ్లీకి మిగతా 2లో



### బంగాళాఖాతంలో వరుస
## అల్పపీడనాలు

### పలు జిల్లాల్లో భారీ వర్షాలు!

**న్యూఢిల్లీ/విశాఖపట్నం, ప్రజలకు చేరువ ప్రతినిధి :** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈశాన్య బంగాళా ఖాతం, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. ఇది రాబోయే 24 గంటల్లో పశ్చిమ- వాయవ్య దిశగా వాయువ్య బంగాళాఖాతం వైపు కదిలే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ నెల నాటికి తూర్పు మధ్య, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ 26 నాటికి దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాల్లో వాయువ్య, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇది 27న దక్షిణ ఒడిశా -ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని ఎండీ మిగతా 2లో

## మోడీ డెసిషన్ శభాష్

### వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్



**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** జీఎస్టీ పన్నుల తగ్గింపు అన్నది పేదలకు ఎంతో మేలు చేస్తుందని జగన్ చెప్పుకొచ్చారు. అంతే కాదు మధ్యతరగతి వర్గాలకు కూడా దీని వల్ల ఉపయోగం ఉందని అన్నారు. వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ రియాక్ట్ అయ్యారు. అది కూడా ఒక కీలకమైన విషయం మీదనే ఆయన తన స్పందనను వ్యక్తం చేశారు. సెప్టెంబర్ మిగతా 2లో

## ప్రియాంక గాంధీ వంతు



**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ ఇపుడు దూకుడు మీద ఉంది. ఆ పార్టీ గేర్ మార్చి స్పీడ్ పెంచేసింది. పోయిన చోటనే వెత్తుక్కోవాలని అంటారు. ఆ విషయం శతాధిక వృద్ధ పార్టీ అయిన కాంగ్రెస్ కి వేరేగా చెప్పాల్సినది లేదు. ఇప్పటికి మూడున్నర దశాబ్దాల క్రితం బీహార్ లో కాంగ్రెస్ అధికారం పోగొట్టుకుంది. అదే సమయంలో యూపీ కూడా దూరం అయింది. దాంతో బీహార్ తో మొదలెట్టి ఉత్తరాదిన బలపడాలని మిగతా 2లో



### విశాఖ ఈఎన్టీ ఆసుపత్రిలో
## ఉచితంగా శస్త్రచికిత్సలు

### చిన్నారులకు ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంటేషన్
### ముందుగా స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించిన తర్వాత శస్త్రచికిత్స

**విశాఖపట్నం, ప్రజలకు చేరువ ప్రతినిధి :** కొందరు పిల్లలకు పుట్టుకతోనే చెవులు పనిచేయవు. అందువలన ఎటువంటి శబ్దం వినలేరు. ఇలాంటి వారికి పెదవాల్తేరు ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు ఆసుపత్రిలో ఉచితంగా ఆధునిక చికిత్స అందిస్తున్నారు. ప్రతి సంవత్సరం వందలాది మందికి శస్త్రచికిత్సలు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. అప్పుడే పుట్టిన పిల్లల్లో ఆ లక్షణాలను ఎలా గుర్తించాలి? ఎలాంటి చికిత్స అందిస్తారనే అంశాలపై ఆసుపత్రి వైద్యులు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలు చెవిటి, మూగవారని తెలిస్తే తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. ఇలాంటి పిల్లలకు కాక్లియర్ ప్లాంట్లు అమర్చడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చు. లక్షలాది రూపాయల ఖర్చుతో కూడిన ఈ శస్త్రచికిత్సలను గతంలో ఆరోగ్యశ్రీ ద్వారా ఓ చెవికి మాత్రమే నిర్వహించేవారు. కానీ మిగతా 2లో

## తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకూడదు




### ఒంగోలు జిల్లా కలెక్టర్ గోపాలకృష్ణ



**ఒంగోలు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** జిల్లాలో త్రాగునీటి కోసం ప్రజలెవరూ ఇబ్బంది పడరాదన్నదే తన తొలి ప్రాధాన్యమని కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణతో కలిసి జిల్లాలో తాగునీటి సరఫరా, భూగర్భ నీటిమట్టం, నీటి వనరులను పెంచేందుకు చేపట్టాల్సిన కట్టడాలపై ఆర్డబ్ల్యూఎస్, భూగర్భ మిగతా 2లో

(మొదటి పేజీ తరువాయి)

## స్వదేశీ ఉత్పత్తులే కొనండి- అమ్మండి

నుంచి జీఎస్టీ బచత్ ఉత్సవ్ (జీఎస్టీ పొదుపు పండుగ) ప్రారంభమైందని పేర్కొన్నారు. "ఈ ఏడాది చేపట్టిన జీఎస్టీ సంస్కరణలు కారణంగా పండుగ సీజన్? మరింత ఆనందదాయకం అవుతుంది. ఈ సంస్కరణలు పొదుపును పెంచుతాయి. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి, వ్యాపారులు, ఎంఎస్?ఎంఈలకు ఇలా సమాజంలోని ప్రతి వర్గానికి ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తాయి. అంతే దేశ ఆర్థిక వృద్ధికి, పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుంది. ప్రతి రాష్ట్రం, ప్రాంతం పురోగతి వేగవంతం అవుతుంది"

**స్వదేశీ వస్తువులే కొందాం, అమ్ముదాం, వాడుదాం**

"జీఎస్టీ సంస్కరణలు మన స్థానిక ఉత్పత్తుల తయారీని మరింత బలోపేతం చేస్తాయి. ఆత్మనిర్భర్ భారత్? వైపు మార్గం సుగమం చేస్తాయి. అందుకే ఈ పండుగ సీజన్?లో భారత తయారీ ఉత్పత్తులకు మద్దతు ఇవ్వాలని మనం సంకల్పించుకుందాం. అంటే బ్రాండ్?, తయారీ సంస్థతో సంబంధం లేకుండా, మన భారతీయుల స్వేదం, శ్రమతో తయారైన స్వదేశీ ఉత్పత్తులనే కొనుగోలు చేయాలి, అమ్మాలి, వినియోగించాలి. మీరు మన దేశ చేతివృత్తులవారు, కార్మికులు, పరిశ్రమలు తయారు చేస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేసిన ప్రతిసారి, అనేక కుటుంబాలు జీవనోపాది సంపాదించడానికి సహాయం చేస్తున్నారు. మన యువతకు ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తున్నారు. అందుకే మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులను విక్రయించాలని నేను దుకాణదారులకు, వ్యాపారులకు విజ్ఞప్తి చేస్తున్నాం. మనం కొనేది స్వదేశీ. మనం అమ్మేది స్వదేశీ అని గర్వంగా చెప్పుకుందాం అన్నారు. ఈ సందర్భంగా, రాష్ట ప్రభుత్వాలు పరిశ్రమలను, తయారీ, పెట్టుబడులకు తగిన వాతావరణాన్ని సృష్టించాలి, ప్రోత్సహించాలని కోరుతున్నానని మోదీ అన్నారు.

## 2026 నాటికి భారత్‌కు ఎస్-400

రెజిమెంట్ల విషయంలో భారత్ 2018 అక్టోబర్ 5న రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ దాదాపు రూ.40వేల కోట్లు. వాస్తవానికి 2024 తొలి అర్ధభాగంలోనే మొత్తం ఐదు ఆర్డర్లను అందజేయాల్సింది. కానీ, ఇప్పటి వరకు నాలుగు చేరుకోగా, చివరి ఆర్డర్‌ను వచ్చే ఏడాది నాటికి ఇవ్వనున్నారు.

ఇక పాకిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ వేళ ఎస్-400 ప్రపంచ రికార్డు సృష్టించింది. ఓ విమానాన్ని ఏకంగా 300 కిలోమీటర్ల అవతల నుంచే ధ్వంసం చేసినట్లు అధికారులు వెల్లడించారు. వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా గతంలో ఎన్నడూ ఊపరితలంపై నుంచి గగనతల లక్ష్యాన్ని ఛేదించింది లేదు. అంతకు ముందు కూల్చిన లక్ష్యాల్లో 200 కిలోమీటర్ల దూరమే ఇప్పటి వరకు అత్యధికం. ఎస్-400 గగనతల వ్యవస్థలో వాడే నాలుగు రకాల క్షిపణుల్లో 40ఎన్6 రేంజి 400 కిలోమీటర్లు దూరం వెళ్లనుంది. దీనిని ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వాయుసేన పూర్తిస్థాయిలో వాడుకొంది. ఈ వ్యవస్థకు భయపడి పాక్ తమ ఎఫ్-16 ఫైటర్ జెట్లు, చైనా నుంచి కొనుగోలు చేసిన విమానాలను సుదూర ప్రదేశాలకు తరలించిందంటేనే దీని ప్రభావం ఏ మేరకు ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం వాయుసేన ఆధ్వర్యంలో పాక్, చైనా సరిహద్దుల్లో 1.5 రెజిమెంట్ల చొప్పున మోహరించారు.

**మరిన్ని ఎస్-400 కొనుగోళ్లకు రష్యాతో భారత్ చర్చలు :** మరోవైపు ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను మరికొన్ని సమకూర్చుకోవటంపై భారత్ దృష్టి సారించింది. ఇప్పటికే రష్యాతో చర్చలు మొదలైనట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని రష్యా రక్షణశాఖ వర్గాలు ధ్రువీకరించాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్-400 అద్భుతంగా పనిచేసినట్లు వాయుసేన పేర్కొనటంతో మరికొన్ని యూనిట్లు కొనుగోలు చేసేందుకు భారత్ సిద్ధమైనట్లు సమాచారం. ఇటీవల రష్యా విక్టరీ వేడుకలకు హాజరైన హోం శాఖ సహాయ మంత్రి సంజయ్ సేఠ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఆపరేషన్ సిందూర్‌లో ఎస్-400 అద్భుతంగా పనిచేశాయని వెల్లడించారు. వీటిని మరిన్ని కొనుగోలు చేసేందుకు చూస్తున్నామని, ఇంకా అత్యాధునిక ఎస్-500 రక్షణ వ్యవస్థలపైనా ఆసక్తిచూపిస్తున్నట్లు చెప్పారు.

## బీజేపీ మళ్ళీ జమిలి

మీద కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఒకేసారి పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికలు జరిగినట్లయితే, దేశ ఆర్థిక పరిస్థితి మెరుగవడమే కాదు, స్థిరత్వం ఏర్పడుతుందని చెప్పారు. అంతే కాదు ఎన్నికలకు అయ్యే ఖర్చు లక్షల కోట్లతో తగ్గుతుందని ఆమె చెప్పారు.

**గొలుసు కట్టు తెగకుండా :** సాధారణంగా జమిలి ఎన్నికలు అంటే కలిగే సందేహాలు ఏమిటి అంటే ఒక అసెంబ్లీకి నెగ్గిన ప్రభుత్వం మధ్యలో కుప్ప కూలితే మళ్ళీ ఎన్నికలు పెడతారు కదా అలా అయిదేళ్ళకు ఆ ప్రభుత్వం వస్తే ఈ జమిలి గొలుసు కట్టి తెగిపోతుంది కదా అన్నది. అయితే దీనికి బాన్సూరి స్వరాజ్ సమాధానం ఇచ్చి కొంత స్పష్టత కలిగించారు. ఒకేసారి కేంద్రానికి రాష్ట్రాలకు జమిలి ఎన్నికలు జరిగిన నేపథ్యంలో ఏదైనా కారణం చేత అసెంబ్లీ రద్దు అయితే ఆ మిగిలిన మిగిలిన కాలానికే ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఉంటుందని ఆమె చెప్పుకొచ్చారు. అంటే ఒక శాసన సభ అయిదేళ్ళ పదవీ కాలంలో మధ్యలో రద్దు అయితే మిగిలినది రెండేళ్ళు ఉంటే ఆ కాలానికే మళ్ళీ ఎన్నికలు ఉంటాయన్న మాట. ఇప్పటిదాకా మధ్యంతర ఎన్నికలు వస్తే మరో అయిదేళ్ళ పాటు సభ కాలం ఉండేది. సో ఈ విషయంలో క్లారిటీ వచ్చేసింది. ఇదే విధానంలో ఎంపీలు ఎమ్మెల్యేలు మధ్యలో తప్పుకున్నా రాజీనామా చేస్తే కూడా ఎన్నికలు పెడతారు అని అంటున్నారు.

## ఆర్‌జేడీలో చేరే ప్రసక్తే లేదు

ప్రతాప్ యాదవ్ ఇప్పుడు జనశక్తి జనతా దళ్ పేరుతో ప్రచారం చేస్తున్నారు. పలు పార్టీలతో కలిసి కూటమి ఏర్పాటు చేసి అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పని చేస్తున్నారు. 243 నియోజకవర్గాల్లో పోటీ చేసే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. అయితే, తేజ్ ప్రతాప్ యాదవ్‌కు లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య మద్దతు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీతో ఆమెకు విభేదాలు వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది.

**వార్తలపై స్పందించిన లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య**

మరోవైపు తనపై వస్తున్న వార్తలపై లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య స్పందించారు. తనకు ఎలాంటి రాజకీయ కోరికలు లేవని, తనపై వస్తున్న వార్తలన్నీ అవాస్తవాలేనని స్పష్టం చేశారు. తాను పార్టీని హస్తగతం చేసుకోవాలని చూస్తున్నట్లు పెయిడ్ మీడియా, ట్రోల్స్ అవాస్తలవాలు ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. తనకు ఎలాంటి రాజకీయ కోరికలు లేవని, రాజ్యసభ సీటు లేదా అసెంబ్లీ టికెట్‌పై ఆశ లేవని చెప్పారు. "నాకు కుటుంబంలోని ఎవరితోనూ ఎలాంటి వివాదం లేదు. భవిష్యత్తులో ప్రభుత్వంలోనూ ఎలాంటి పదవులను ఆశించడంలేదు. నాకు ఆత్మగౌరవం, కుటుంబ మర్యాదలు, విలువలు ఎక్కువ ప్రాధాన్యం." అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇటీవలె తండ్రి, సోదరుడు ఎక్స్ ఖాతాలను అన్ ఫాలోచేయడంతో పాటు ఆమె పెట్టిన పోస్టులతో ప్రచారం మొదలైంది. అంతకుముందు గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సరన్ నియోజకవర్గం నుంచి ఎంపీగానూ పోటీ చేశారు. అంతకుముందు ఓ మహిళతో రిలేషన్‌షిప్‌లో ఉన్నానంటూ తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో పెట్టిన ఓ పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## ఇంత పిరికి వాడివా..!

రాకుండా దొంగచాటుగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు సంతకాలు పెట్టే రిజిస్టర్ సభ లోపల పెట్టేలా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జగన్ అసెంబ్లీకి రావచ్చని సరిపడా సమయం స్పీకర్ ఇస్తారని స్పష్టం చేశారు. అసెంబ్లీకి వచ్చి జగన్ అన్ని మాట్లాడవచ్చన్నారు. జగన్ మైక్ స్పీకర్ ఎందుకు కట్ చేస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వారం అంతా బిజీ షెడ్యూల్ ఉందని మంత్రి లోకేశ్ మీడియాతో చిట్‌చాట్‌లో వెల్లడించారు. ఆయనలా ఎవరూ తిరగలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. జిల్లాలకు వెళ్తూనే మళ్లీ అసెంబ్లీకి వస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు నిత్యం ప్రజలు, పని అని ఆలోచిస్తారని స్పష్టం చేశారు. పర్యటనలు ఎక్కువ అవుతున్నాయని ఎవరైనా చెప్పే ప్రయత్నం చేసినా వినట్లేదని తెలిపారు. సీఎం తో కాసేపు కుటుంబ సభ్యులం మాట్లాడాలి అని అనుకున్నా సమయం దొరకడం లేదన్నారు.

జీఎస్టీ పై అక్టోబర్లో వరుస కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. మొత్తం 50వేల కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీ సర్కార్ ఆలోచనగా తెలిపారు. సూపర్? జీఎస్టీ సూపర్ సేవ్ పేరుతో కార్యక్రమాలు జరుపుతామన్నారు. అక్టోబర్ 19 కల్లా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

**టీటీడీ పరకామణిలో దొంగలు పడ్డారు – వీడియోలు విడుదల చేసిన లోకేశ్**

టీటీడీ పరకామణి వ్యవహారంలో త్వరలోనే సిట్ వేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. జగన్ అండ్ టీం దేవుడి దగ్గర నాటకాలు ఆడారని అందుకే దేవుడు ఏం చేయాలో అది చేశాడని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ వద్ద మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. వైఎస్సార్?సీపీ హయాంలో పరకామణి దొంగను అరెస్ట్ చేయకుండా 41ఏ నోటీసులు ఇచ్చి పంపిచేశారన్నారు. ఈ కేసులో అనేక వాస్తవాలు బయటకు రావాల్సి ఉందన్నారు. తిరుపతి కల్తీ నెయ్యి వ్యవహారంలో కీలక ఆధారాలు బయటకు వస్తున్నాయని చెప్పారు. మెగా డీఎస్సీకి ఎన్ని అవాంతరాలు ఎదురైనా విజయవంతంగా పూర్తిచేశామని నారా లోకేశ్ తెలిపారు. 106 కేసులు ఎదుర్కొని కార్యక్రమాన్ని జయప్రదం చేశామన్నారు. మెగా డీఎస్సీ నియామకపత్రాలు అందజేతకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్?ను ఆహ్వానించామన్నారు. ఆయన తప్పకుండా వస్తారని చెప్పారు. ఏటా ఓ పద్ధతి ప్రకారం డీఎస్సీ నిర్వహిస్తున్నామన్నారు. సెప్టెంబర్ నెలాఖరుకు విద్యార్థుల అడ్మిషన్లపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. తల్లికి వందనంతో పాటు 3 నెలల్లో అన్ని బకాయిలు చెల్లిస్తామన్నారు. జనవరిలో క్వాంటమ్ కంప్యూటర్ వచ్చేస్తుందన్నారు. భవనం అందుబాటులోకి వచ్చేవరకు విట్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తానని స్పష్టం చేశారు. అక్టోబర్ నుంచి రాష్ట్రానికి వరుస పెట్టుబడులు తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 20లక్షల ఉద్యోగాల కల్పన దిశగా నిర్విరామ కృషి జరుగుతోందన్నారు. ప్రజా-ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రైవేటును భాగస్వామ్యం చేస్తే ప్రైవేటీకరణా? సామాన్యుడికి మెరుగైన సేవలు త్వరగా తెచ్చేందుకే పీపీపీ విధానంలో వైద్యకళాశాలలు, రోడ్లు, విమానాశ్రయాలు ఇలా అనేక విషయాల్లో ప్రభుత్వం పీపీపీ విధానంలో ముందుకెళ్తోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్ ఏ పనులూ చేయలేదని ఇప్పుడు తమను చేయనివ్వమంటే ఎలా? తన మనుషులకు ఇచ్చిన కాంట్రాక్టులు పోతున్నాయనే ఆందోళన ఆయనలో ఉన్నట్టుంది అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

## అల్పపీడనాలు

ప్రఖర్ జైన్ వివరించారు. రేపు, ఎల్లుండి ఉత్తరాంధ్రలో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీవర్షాలు పడే అవకాశాలున్నాయని తెలిపారు. అలాగే గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్రలో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**పలు చోట్ల భారీ వర్షాలు :** ఆదివారం రాష్ట్రంలోని పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. దీని ప్రభావంతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**నల్లమలలో భారీ వరద :** నల్లమల అడవుల్లో కురిసిన భారీ వర్షాలకు నంద్యాల పట్టణంలోని చామకాలువ ఉద్ధృతంగా ప్రవహించింది. చామ కాలువలో చేరిన వరద నీరు పట్టణంలో శ్యాం నగర్?లోకి వచ్చింది. ఎస్?బీఐ కాలనీ సమీపంలో చామకాలువలో వరద నీరు వంతెన పై భాగాన్ని తాకింది. చామ కాలువ వరద నీటి ఉద్ధృతిని టీడీపీ జిల్లా కార్యదర్శి ఫిరోజ్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టారు. శ్యాం నగర్?కు చెందిన 30 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నంద్యాల జిల్లా కలెక్టరు రాజకుమారి ఆధ్వర్యంలో అధికారులు అన్ని విధాల చర్యలను చేపట్టారు.

**మోకాళ్ల లోతు నీటిలో వాహనాలు :** గుంటూరు నగరపు చుట్టుపక్కల భారీ వర్షం కురిసింది. గంటకుపైగా కురిసిన వర్షానికి రోడ్లపైకి భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల మోకాళ్ల లోతు నీటిలో వాహనాలు ముందుకు వెళ్లాల్సి వచ్చింది. మూడు వంతెనలు, కంకర గుంట అండర్ పాస్?లోకి వాననీరు చేరటంతో ఆ మార్గాల్లో వాహనాల రాకపోకలు నిలిపేశారు. పాదచారులు భయం భయంగా నీటిలో రాకపోకలు సాగించారు.

**ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం :** కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు తాతకుంట్లకు మధ్యలో ఉన్న వెలుగు కార్యాలయం దగ్గరలో చెట్టుపై కరెంటు తీగలు పడి మంటలు చెలరేగాయి. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని చిట్టినగర్, టైలర్ పేట, జోడి బొమ్మలు సెంటర్, గొల్లపాలెం గట్టు మహంతిపురం, పాతబస్తీలోని కొన్ని వీధులు, రహదారులు జలమయమయ్యాయి.

## మోడీ డెసిషన్ శభాష్

22 నుంది దేశవ్యాప్తంగా అమలు అవుతున్న జీఎస్టీ రెండవ తరం సంస్కరణలు గురించి ఆయన ట్వీట్ చేశారు. మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మీద ఆయన సానుకూలంగానే స్పందించారు. ఇది చాలా స్వాగతించదగిన నిర్ణయం అన్నారు.

**పేదలకు మేలుగా :** జీఎస్టీ పన్నుల తగ్గింపు అన్నది పేదలకు ఎంతో మేలు చేస్తుందని జగన్ చెప్పుకొచ్చారు. అంతే కాదు మధ్యతరగతి వర్గాలకు కూడా దీని వల్ల ఉపయోగం ఉందని అన్నారు. ఇది ఒక విప్లవాత్మకమైన నిర్ణయం అన్నారు. అంతే కాకుండా పన్నులు సరళంగా న్యాయబద్ధంగా ఉన్నాయని చెప్పారు. పన్నుల వ్యవస్థలో ఇది ఒక విప్లవాత్మకమైన నిర్ణయంగా ఆయన చెప్పారు. జీఎస్టీ పన్నులు ప్రతీ సామాన్యుడుకి ఎంతగానో ఉపకరిస్తాయని అన్నారు. ప్రాధమికంగా అయితే కొన్ని ఫిర్యదులు ఉండొచ్చు కానీ ఇది ఒక ప్రక్రియ అని జగన్ అన్నారు. ఆర్థిక వ్యవస్థలో వినియోగానికి మరిన్ని పెట్టుబడులకు అవసరం అయిన ప్రోత్సాహాన్ని అందిస్తాయని ఆశిస్తున్నాను అన్నారు. దీని పూర్తి ప్రయోజనాలు చివరి వినియోగదారుడి దాకా చేరుకుంటాయని తాను ఆశిస్తున్నాని అని జగన్ ట్వీట్ ముగించారు.

**లేట్ గా అయినా :** ఇక జగన్ లేట్ గా అయినా లేటెస్ట్ గానే రియాక్ట్ అయ్యారు అని అంటున్నారు. నిజానికి పది రోజుల నుంచే జీఎస్టీ పన్ను తగ్గింపుల మీద దేశవ్యాప్తంగా చర్చ సాగుతోంది. అన్ని రాజకీయ పార్టీలు తన స్పందనను తెలియచేశాయి. ఇక కూటమి నేతలు అయితే ఘనంగా స్వాగతిస్తున్నారు. వైసీపీని ఈ విషయంలో విమర్శించారు కూడా జీఎస్టీ గురించి అవగాహన ఉందా అని కూడా కామెంట్స్ వచ్చాయి. అయితే జగన్ జీఎస్టీ అమలు అయిన రోజునే తన రియాక్షన్ ఇచ్చారు.

**మోడీకే జై అంటూ :** ప్రతిపక్షాలు జీఎస్టీ మీద స్వాగతం చెబుతూనే తమదైన విమర్శలు చేశాయి. కేంద్ర ప్రభుత్వం మీద కూడా వారు బాణాలు ఎక్కు పెట్టారు. కానీ జగన్ ఎలాంటి విమర్శ లేకుండా డైరెక్ట్ గానే మోడీ డెసిషన్ గుడ్ అనేశారు. ఒక విధంగా జై కొట్టేశారు. ఈ విషయంలో ఎలాంటి శషబిషలకు ఆయన పోదలచుకోలేదని అంటున్నారు. ఒక మంచి నిర్ణయం ప్రజలకు పేదలకు ఇందులో న్యాయం జరిగింది కాబట్టి వెల్ కం చెప్పారని అంటున్నారు. అలా మోడీ సర్కార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జీఎస్టీ సంస్కరణలకు ఏపీలో ఎన్డీయే పక్షాలతో పాటు వైసీపీ కూడా ఆహ్వానించినట్లు అయింది అని అంటున్నారు.

## ప్రియాంక గాంధీ వంతు

చూస్తోంది. దాని కోసం తొందరలో జరగనున్న బీహార్ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుంది.

**అందుకే సీడబ్ల్యూసీ :** కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత విధాన మండలి అయిన సీడబ్ల్యూసీ సమావేశాలను ఈసారి బీహార్ లో నిర్వహిస్తునారు. ఆ రాష్ట్ర రాజధాని పాట్నాలో ఇవి జరగనున్నాయి. సాధారణంగా ఢిల్లీలో ఈ సమావేశాలు జరుగుతూంటాయి. కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రం ఢిల్లీ వెలుపల నిర్వహిస్తారు. ఇపుడు బీహార్ లో నిర్వహిస్తున్నారు అంటే కాంగ్రెస్ టార్గెట్ ఎంత కరెక్ట్ అన్నది అర్థం అవుతోంది. ఈ నెల 24న జరిగే ఈ సమావేశాలకు కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ సోనియా గాంధీ ప్రియాంకా గాంధీ హాజరవుతున్నారు.

ప్రియాంకా యాత్ర స్టార్ట్ : ఇక సీడబ్ల్యూసీ ముగిసిన తరువాత ఈ నెల 26 నుంచి ప్రియాంకా గాంధీ బీహార్ లో పది రోజుల పాటు హర్ ఘర్ అధికార యాత్ర పేరుతో భారీ యాత్రకు శ్రీకారం చుడుతున్నారు. గత నెలలో ఏకంగా 15 రోజుల పాటు రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్ర నిర్వహించి కాంగ్రెస్ కి కొత్త బలం తీసుకుని వచ్చారు. ఇపుడు దానికి మరింత ఊపు తెచ్చేందుకు కీలక వర్గాలను లక్ష్యంగా చేసుకుని ప్రియాంకా గాంధీ జనంలోకి వస్తారని అంటున్నారు.

**వారితోనే విజయం :** బీహార్ మొత్తం జనాభాలో అత్యధిక మహిళలు ఉన్నారు. అంతే కాదు ఓటర్లలో కూడా మూడు కోట్ల 41 లక్షల మంది వారే ఉన్నారు. అంటే అత్యధిక ఓటు బ్యాంక్ అన్న మాట. వారి మద్దతు ఉన్న పార్టీలే ప్రతీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ వచ్చాయి. ఈసారి కూడా వారి మద్దతు పొందిన పార్టీలదే బీహార్ పీఠం అని సర్వేలు చెబుతున్న వేళ కాంగ్రెస్ ప్రత్యేకించి గురి పెడుతోంది. అందుకే ప్రియాంకా గాంధీని రంగంలోకి దింపుతోంది అంటున్నారు.

## తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకూడదు

జల వనరులు, డ్వామా, పంచాయతీ, జిల్లా పరిషత్, ఇరిగేషన్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ సోమవారం తన చాంబర్లో సమీక్షించారు. జిల్లాలో తాగునీటి వనరులు, ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్న తీరుపై ఆయన ఆరా తీశారు. కాగా పైపులైన్లు, ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న వివరాలను ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. బాల శంకరరావు సందర్భంగా కలెక్టరుకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా త్రాగునీటి ట్యాంకర్ల గమనాన్ని పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. భూగర్భ నీటిమట్టం, వాటిని పెంచేందుకు చేపట్టిన చర్యలను భూగర్భ నీటి వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ( ఇన్చార్జి ) డి. వందనం వెల్లడించారు. నీటి వనరుల సంరక్షణ, భూగర్భ నీటి మట్టాన్ని పెంచేందుకు తమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల వివరాలను డ్వామా పీ.డీ. జోసఫ్ కుమార్ తెలియజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ త్రాగునీటి కోసం ప్రజలు రోడ్డు ఎక్కే పరిస్థితి రాకూడదన్నారు. ట్యాంకర్ల సరఫరాలో ఎస్సీ, ఎస్టీ కాలనీల పట్ల పక్షపాతం ఉండరాదని స్పష్టం చేశారు. నిర్దిష్ట ప్రాంతాలకు కాకుండా మంచినీటి ట్యాంకులు డైవర్ట్ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. బోర్లు వేసే విషయంలో భూగర్భ నీటి వనరుల శాఖ గుర్తించిన జియో కోఆర్డినేట్స్ తో సమన్వయం చేసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. నీళ్లు లేనిచోట బోర్లు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయరాదని చెప్పారు. మంచినీటి పథకాల మరమ్మతులు, ఇతర ఖర్చులకు నిధులు మంజూరు చేయిస్తానని కలెక్టర్ తెలిపారు. చెరువులలో పూడిక తీతపైనా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

**ప్రత్యేక యాప్:** త్రాగునీటి సరఫరాకు సంబంధించి ఎలాంటి సమస్య ఎదురైనా సంబంధిత శాఖల అధికారుల దృష్టికి వెళ్లేలా ప్రత్యేకంగా జిల్లా స్థాయిలో ఒక యాప్ ను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏయే అంశాలను ఇందులో పొందుపరచాలో అధ్యయనం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు చెప్పారు.

**కలెక్టరేట్లో శాశ్వత కంట్రోల్ రూమ్ :** వివిధ అంశాలకు సంబంధించి తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నట్లుగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన 24 గంటలూ పనిచేసేలా కలెక్టరేట్లో ఒక కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ అంశాలు, వర్షాలు, ఇతర విపత్తుల సమయంలో జిల్లా కేంద్రం నుంచి పరిస్థితిని పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయి సిబ్బందికి దిశా నిర్దేశం చేసేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం త్రాగునీటి సమస్యపై తక్షణమే దృష్టి సారించాలన్నారు. జిల్లా మొత్తంమీద త్రాగునీటికి ఉన్న డిమాండు, క్షేత్రస్థాయిలో సరఫరా అవుతున్న తీరును ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా పర్యవేక్షించేలా సంబంధిత శాఖల నుంచి ఒక ఉద్యోగిని ఇక్కడ కేటాయించాలని చెప్పారు. సమస్యలపై ప్రజలు నేరుగా మాట్లాడేలా ప్రత్యేకంగా ఫోన్ నెంబరును కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, ఇరిగేషన్ ఎస్.ఈ. వరలక్ష్మి, ఏపీ సి పి డి సి ఎల్ ఎస్.ఈ. కట్టా వెంకటేశ్వర్లు, డిపిఓ ఎం.వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.౦౦

## ఉచితంగా శస్త్రచికిత్సలు

ప్రస్తుతం ప్రభుత్వం రెండు చెవులకూ ఉచితంగానే కాక్లియర్ ప్లాంట్ల అమరిక ఆపరేషన్లను నిర్వహిస్తుంది.

**ముందస్తుగా పరీక్షలు:** పుట్టుకతో చెవుడు ఉన్న చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంటేషన్ అవసరమనుకుంటే మూడు నెలలు ముందుగానే ఆసుపత్రిలో చేర్పించాల్సి ఉంటుంది. ముందుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయాల్సి ఉంటుందని ఈఎన్టీ ఆసుపత్రి వైద్యులు చెబుతున్నారు. చెవిలో నాడులు ఎలా ఉన్నాయి? మెదడులో నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తోందా? కాక్లియర్ ఇంప్లాంటేషన్ తరువాత నాడీ వ్యవస్థ ఎలా స్పందిస్తుంది? అనే అంశాలను నిర్ధారించడానికి వివిధ పరీక్షలు చేస్తామని వారు వెల్లడించారు. అవన్నీ బాగుంటే పరికరాన్ని అమరుస్తామనీ, అది వినికిడి వ్యవస్థను ప్రేరేపిస్తుందనీ, తద్వారా చిన్నారులు వినగలుగుతారని వైద్యులు పేర్కొన్నారు.

**ఇంప్లాంట్ పరికరానికి రూ.4.50 లక్షలు:** జన్యుపరమైన లోపాలు, మేనరిక వివాహాల కారణాలతో కొందరు పిల్లలకు పుట్టుకతో చెవుడు వస్తుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ అన్నారు. కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్సకు అర్హత ఉందని భావిస్తే ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. అక్కడ అర్హులని నిర్ధరణ అయితే శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం రూ.4.50 లక్షల విలువైన ఇంప్లాంట్ పరికరం సమకూరుస్తుంది. ఇతర పరీక్షలు, శస్త్రచికిత్స, స్పీచ్‌తెరపీ కోసం అదనంగా రూ.80 వేలను అందజేస్తుందని డాక్టర్ హరికృష్ణ తెలిపారు.

**చికిత్సకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్:** మూడేళ్లలోపు పిల్లల అయితే రెండు చెవులకు ఒకేసారి శస్త్రచికిత్స చేస్తామని డాక్టర్ హరికృష్ణ అన్నారు. 3 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలకు అయితే ఒక చెవికి మాత్రమే చేస్తామని వివరించారు. శస్త్రచికిత్స చేసిన మూడు వారాల అనంతరం యంత్రాన్ని ఆన్ చేస్తామన్నారు. అనంతరం ఒక సంవత్సరం పాటు స్పీచ్‌తెరపీ ద్వారా మాటలు నేర్పిస్తామని డాక్టర్ హరికృష్ణ తెలిపారు. వీటిపై తల్లిదండ్రుల్లో సందేహాలు ఏమైనా ఉంటే 0891 2970171 ఫోన్ నెంబరుకు సంప్రదించాలని కోరారు.

## మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు

### వైద్య అధికారిని ప్రియాంక








**పెట్లూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** మహిళలకి ప్రత్యేక వైద్య శిబిరాలు మహిళల ఆరోగ్యానికి పెద్ద పీట కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్నాయి. పెట్లూరు సిహెచ్సి వైద్యశాల పరిధిలోని కట్టవారిపాలెం లోస్వస్థ నారి ససక్తి పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరమ్ ఏర్పాటు చేసి నట్లు పెట్లూరు సిహెచ్ సి వైద్యురాలు డాక్టర్ ప్రియాంక తెలిపారు ఈ శిబిరంలో కట్టవారిపాలెం గ్రామంలో ప్రజలకు భారీ స్పందన వచ్చింది వాతావరణం మార్పులు కారణంగా జ్వరాలువచ్చిన వారు రోగులకు బీపి థైరాయిడ్ షుగర్ ఈసీజీ రక్త పరీక్షలు నిర్వహించి నెలరోజులకు సరిపడా మందులు పంపిణీ చేసినట్లు సూపర్వైజర్ లక్ష్మీనరసింహం తెలిపారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సూపర్వైజర్లు మెడికల్ ఆఫీసర్లు ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే ఆదేశాలతో చింతలపాలెంలో

# వైద్య శిబిరం




**కనిగిరి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** కనిగిరి మున్సిపాలిటీ 4వ వార్డు చింతలపాలెం ఏరియా లో విష జ్వరాలు వ్యాపించడం తో ప్రజలు తీవ్ర అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించే మందులు పంపిణీ చేశారు. ఈ కార్యకమంలో డా. ఫణి, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఏఎన్ఎం , ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది తో 4 వ వార్డ్ అధ్యక్షులు మూలే శ్రీనివాసులు రెడ్డి,ప్రసాద్ రెడ్డి,రమణారెడ్డి,బ్రహ్మారెడ్డి,గోడి ప్రభాకర్, టిడిపి టౌన్ పట్టణ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, తెలుగు యువత అధ్యక్షులు అచ్చాల రవి, మాజీ కోఆప్షన్ సభ్యులు షరీఫ్ , యూనిట్ ఇంచార్జ్, పెన్నా కొండలు, నాగ పాతూరు తెలుగుదేశం పార్టీ 4వ వార్డు కే ఎస్ ఎస్ సభ్యులు ఈ పాల్గొన్నారు.

### అనధికార లేఔట్లకు

# క్రమబద్ధీకరణ

**మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్**




**కనిగిరి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** అనధికార లే అవుట్ల క్రమబద్దీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించడం జరిగిందని మునిసిపల్ కమీషనర్ పి. కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళికా విభాగం, రియల్టర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ క్రయ విక్రయాలకు ఇబ్బందులు పడుతున్న లేఅవుట్ల యజమానులతో పాటు వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసుకున్న వారు క్రమబద్దీకరణ చేసుకోవచ్చన్నారు. 2025 జూన్ 30 లోపు అనధికార లే అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను రేగ్యులైజ్ చేసుకోవడానికి మరోసారి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వం పేర్కొన్న విధంగా 90 రోజుల లోగా 2025 అక్టోబర్ 24 లోపు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేసుకోనని యడల సదరు లేఅవుట్ల పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ సువర్ణ కుమార్ మాట్లాడుతూ దరఖాస్తుదారులు పురపాలక శాఖ నిబంధనలకు అనుగుణంగా తమ ప్లాట్లను రేగ్యులైజ్ చేసుకునేందుకు పటిష్టమైన ఆధారాలు పురపాలక సంఘం వెబ్ సైట్ నందు లేదా టౌన్ ప్లానింగ్ విభాగం వారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కో ప్లాటు కు రుసుము ఎన్ని రూపాయలు చెల్లించ వలసివస్తుంది అని తక్షణమే వారి ముందు ఆన్లైన్ నందు చూపించుట జరిగినది. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్లాట్లనుక్రమబద్ధీకరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రియల్టర్లు, మునిసిపల్ సిబ్బంది, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

### వరి పంటకు అనవసరంగా

# పురుగుమందులు వాడొద్దు

**వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భవాని**





**అనకాపల్లి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** ప్రస్తుతం వరి మళ్ళలో ఆకుముడత పురుగు ఆశించిందని, కొన్ని పొలాల్లో పొటాషియం లోపం గమనించామని అనకాపల్లి ప్రాంతం వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. బి. భవాని అన్నారు.సోమవారం కొండకర్ల, తిమ్మరాజుపేట, హరిపాలెం, జగ్గన్నపేట గ్రామాలలో, శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. బీసీటీ–కృషి విజ్ఞాన కేంద్రం సస్యసేద్య శాస్త్రవేత్త డా. వాన ప్రసాదరావు, వ్యవసాయ అధికారి శంకర గోవింద్ లతో కూడిన బృందం ప్రస్తుత వరి పంటలను పరిశీలించారు.ముదురు ఆకులు అంచుల నుంచి పసుపు రంగుకు మారడం ద్వారా పొటాషియంలోపం గమనించామని, సవరణకు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అలాగే 10 కిలోల యూరియా ఎకరాకు చల్లాలని సూచించారు. ఆకు ముడత పురుగు ఆశించిన చోట ఆకుల మధ్యలో పురుగు ఉండి ఆకుపచ్చని పదార్థాన్ని గోకితిని వేయడం వలన ఆకులు తెల్లగా మారిపోతున్నాయని వివరించారు. నియంత్రణకు క్లోరోపైరీఫాస్ 2.5 మీ. లీ , ప్రొఫెనోఫోస్ 2 మీ. లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా.మందును లీటర్ నీటిలకి కలిపి పొలంలో నీటిని తీసివేసి బాగా తడిచేలా పిచికారి చేసుకోవడం ద్వారా నియంత్రించవచ్చునని తెలిపారు. అక్కడక్కడ పాము పొడ తెగులు గమనించడం జరిగిందనీ. దీని నివారణకు హెక్సాకొనజోల్ 2 మీ లీ. లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు.మోతాదుకు మించి ఎరువులను వాడడం ద్వారా చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉందని, అలాగే నియంత్రించటం కూడా కష్టమవుతుందని, కాబట్టి నిర్దేశించిన మోతాదులో మాత్రమే ఎరువులు వాడాలని రైతులకు వివరించారు.క్షేత్ర సందర్శనలో అభ్యుదయ రైతులు, శరగడం పరశురాం పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

**ఎస్సై ప్రేమ్ కుమార్**



**కొండిపి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్ఐ ప్రేమ్ కుమార్ సూచించారు.మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా కొండేపి గాంధీబొమ్మ సెంటర్లోని మద్యం తాగి వాహనం పై ముగ్గురు వెళ్తున్న వారిని ఎస్సై ప్రేమ్ కుమార్ అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఆర్టీసీ డిపో సెంటర్ టంగుటూరు వెళ్లే రోడ్లో సరైన ధ్రువపత్రాలు లేని మోటర్ వాహనాలకు చలానాలు విధించారు. వాహనదారుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కచ్చితంగా హెల్మెట్ వాడాలని వాహనదారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో




ఎస్సై ప్రేమ్ కుమార్, ఏఎస్ఐ అంకారావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ యాదవ్‌కు

# ధన్యవాదాలు తెలిపిన నాయకులు



**కందుకూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** కందుకూరు నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అనుబంధ విభాగాలలో వివిధ పదవులు పొందిన జిల్లా నాయకులు సోమవారం ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ను వైఎస్ఆర్సిపి కార్యాలయంలో కలసి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విడుదలైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల జిల్లా వివిధ హోదాలో పదవులు పొందిన నాయకులు జిల్లా ఇంటలెక్చువల్ కార్యనిర్వాహ సభ్యులు చక్కా సింగయ్య, జిల్లా ఆర్టిఐ కార్యనిర్వాహన సభ్యులు తాటికొండ వెంకట్రావు, జిల్లా రైతు విభాగం వైస్ ప్రెసిడెంట్ కట్టా హనుమంతురావు,జిల్లా వికలాంగుల సెక్రటరీ మల్లిబోయిన శివకృష్ణ మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైయస్ఆర్ సీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదవులు అలంకరించిన వారు మాట్లాడుతూ మాకు ఈ పదవి ఇచ్చినందుకు మీకు ధన్యవాదములు తెలుపుతున్నామనీ పదవిని హోదాగా కాకుండా బాధ్యతగా తీసుకొని మీ నమ్మకమును మేము నిలబెట్టుకుని కందుకూరు నియోజకవర్గం లో వైఎస్సార్సీపి బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తామని. మళ్లీ కందుకూరులో వైఎస్ఆర్సిపి జండా ఎగరవేసే విధంగా పనిచేస్తామని చెప్పారు.

### బాల త్రిపుర సుందరి రూపంలో

# దర్శనమిచ్చిన పోలేరమ్మ



**జరుగుమల్లి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలో వెలిసిన పోలేరమ్మ అమ్మవారి దసరా నవరాత్రి మహొత్సవాలలో భాగంగా మొదటి రోజు శ్రీ బాలా త్రిపుర సుందరి అవతారంలో భక్తులకి దర్శనం ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకోవటానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని ఆలయ ఈవో బైరాగి చౌదరి తెలిపారు. అమ్మవారు రోజుకు ఒక వేషధారణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసచార్యులు తెలిపారు.

### చిన్న కల్వ గుంటలో అంగన్వాడి

# పోషణ మాసోత్సవాలు



**కొండిపి ప్రజలకి చేరువ ప్రతినిధి :** అంగన్వాడిపోషణ మాసోత్సవాలువారోత్సవాల సందర్భంగా కొండపి మండలం చిన్న కల్లగుంట అంగన్వాడీ కేంద్రంలో వారోత్సవాలను ఘనంగా నిర్వ హించారు. ఈ వారోత్సవాలకు ముఖ్య అతిథిగా పెట్లూరు వైద్యు రాలు పాల్గొన్నారు డాక్టర్ ప్రియాంక పాల్గొని మాట్లాడుతూ పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఇవ్వటం వలన పిల్లలు మానసికంగా దృఢంగా ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుశీల దేవి, సూపర్వైజర్ విక్టోరియా రాణి అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### డీఎస్పీకి ఆహ్వాన పత్రిక

# అందజేసిన ఉత్సవ కమిటీ




**కనిగిరి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** ఆలయంలో జరుగు ప్రత్యేక కార్యక్రమానికి హాజరు కావాలంటూ డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ కి ఉత్సవ కమిటీ ఆహ్వాన పత్రాన్ని అందజే శారు. నందనమారెళ్ళ శ్రీ బాలార్కకోటేశ్వరీ సహిత బాల కోటేశ్వర స్వామి దేవస్థానం లో దేవి శరన్నవరాత్రుల సంద ర్భంగా చతుర్వేద పారాయణ పూర్వక శ్రీ రుద్ర చండీయాగం, రుద్రాభిషేకం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ కి, వెలిగండ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ పావని కళ్యాణి ఆలయ కమిటీ సోమవారం అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాచర్ల వెంకట నరేష్, పాల్వాది జయరాం పాల్గొన్నారు.

### తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లను

# వేగవంతం చేయండి

**కమీషనర్ కృష్ణ మోహన్**

**కనిగిరి ప్రజలకి చేరువ ప్రతినిధి :** కనిగిరి పట్టణం పరిధిలో తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని, బకాయిలు చెల్లించని వారి కనెక్షన్లను వెంటనే తొలగించాలని పి.కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం పురపాలకసంఘము కార్యాలయంలో ఇంజనీరింగ్, సచివాలయ ఎమినిటి కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఎక్కువ బకాయి ఉన్నవారిని గుర్తించి, బకాయులు చెల్లించని గృహాలకు కనెక్షన్ తొలగించాలని, వ్యాపార సంస్థలు అయితే వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. అనుమతి లేకుండా తీసుకున్న కుళాయులను గుర్తించి వారికి వెంటనే నోటీసులు ఇచ్చి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వార్డులలో నీటి సరఫరా, వీధి దీపాలు తదితర అంశాలపై సచివాలయ పరిధిలోని ప్రాంతాలను క్రమం తప్పకుండా కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో మేనేజర్ ఐ. ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ కోటేశ్వరరావు, సచివాలయ ఎమినిటి కార్యదర్శులు పాల్గొన్నారు.

# అవార్డు గ్రహీత ఈశ్వరీభూషణంకు ఘన సన్మానం

**కందుకూరు ప్రజలకి చేరువ ప్రతినిధి :** మట్టి పాదం పుస్తకం రచయిత్రి జి. ఈశ్వరిభూషణంకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావటం అభినందనీయం అని ఎన్ జె. విద్యాసాగర్ అన్నారు. ఆదివారం రాత్రి పూలే, అంబేద్కర్ ఆలోచన వేదిక ఆధ్వర్యంలో కందుకూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కామ్రేడ్ దన్యాసి మాల్యాద్రి అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన భాస పత్రిక సంపాదకులు విద్యాసాగర్, పీసీ పల్లి ఎంఈఓలు జి. సంజీవి, ఆర్. శ్రీనివాసులు, కందుకూరు ఎంఈఓ మానేపల్లి నాగ కుమార్ శర్మ,, కూనం సుబ్బారెడ్డి, కావలి ఎంఈఓ బండి గోవిందయ్య లు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్. మహాత్మ జ్యోతిరావు పూలే, గురజాడ అప్పారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ మారుమూల పల్లెటూరు శాఖవరం పేద కుటుంబంలో పుట్టి డా. బీ.ఆర్. అంబేద్కర్ ఆలోచన విధానంలో భోదించు అనే నినాదాన్ని




ముందుకు తీసుకెళ్లే క్రమమ%శీ%లో ఎందరో పేద విద్యార్థులకు విద్యను అందించి ఉన్నత విద్యా వంతులుగా తీర్చిదిద్దిన మట్టిలో ఆణి ముత్యం ఈశ్వరిభూషణంని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు వెతుక్కుంటూ రావటం చాలా అభినందనీయం అని కొనియాడారు. కందుకూరు ఎంఈఓ మానేపల్లి నాగకుమార్ శర్మ మాట్లాడుతూ ఈశ్వరి భూషణం వృత్తి పట్ల అంకితభావంతో పని చేస్తూ సాహిత్యంలో కూడా రాణిస్తున్నారని, పుస్తకాలు చదివితేనే పుస్తకం వ్రాయగలమన్నారు. కూనం సుబ్బారెడ్డి మాట్లాడుతూ పేద పిల్లలకు సహాయం చేస్తూ విద్యలో ప్రోత్సాహం అందించడం ద్వారా ఎంతోమంది విద్యార్థులు ఉన్నత భవిష్యత్తుకు ఈశ్వరి భూషణం బాటలు వేశారని కొనియాడారు.పిసీ పల్లి సంజీవి మాట్లాడుతూ పేద పిల్లల చదువులు కోసం ఎంతోమంది దాతల సహకారంతో ప్రోత్సహించడం కోసం ఈశ్వరీభూషణం ఎంతో కృషి చేశారని తెలిపారు.ఎంఈఓ ఆర్. శ్రీనివాసులు మాట్లాడుతూ దాతల సహకారం, తల్లిదండ్రులతో మమేకం అవడం, పేద విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేయడం ద్వారా డ్రాప్ అవుట్స్ తగ్గించి పాఠశాలను అభివృద్ధి కోసం ఈశ్వరి భూషణం కృషి చేశారన్నారు. కావలి ఎంఈఓ బండి గోవిందయ్య మాట్లాడుతూ ఈశ్వరీభూషణం సేవలను కొనియాడారు. పూలే,అంబేద్కర్ ఆలోచన వేదిక నాయకులు మద్దిరాల మాధవరావు. ఎం. బుద్ధకోటి ,గడ్డం వెంకట్రావు, డి. చార్వాక , ఉపాధ్యాయులు కరేటి వెంకటేశ్వర్లు, శ్యామ్ పాల్గొని అభినందనలు తెలియజేశారు . అనంతరం ఈశ్వరి భూషణం దంపతులను పూలమాలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, అభిమానులు అధిక సంఖ్యలో హజరై అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు .

### 10-14 ఏళ్ల వయసున్న పిల్లలు

# ప్రైవసీ కోరుకుంటే

## ఈ 4 విషయాలు పొరపాటున కూడా చెప్పకండి



ప్రీ టీన్ వయసు నుంచి పిల్లలను హ్యాండిల్ చేయడం తల్లిదండ్రులకు అంత ఈజీ కాదు. ముఖ్యంగా 10 నుంచి 14 సంవత్సరాల మధ్య వయసుగల పిల్లలు ఒంటరిగా గదిలో ఉండేందుకు ఇష్టపడుతుంటే.. పేరెంట్స్ పొరపాటున కూడా ఈ 4 విషయాలు చెప్పకూడదు. టీనేజ్‌లోకి అడుగు పెట్టే రెండు మూడు సంవత్సరాల ముందు నుంచే పిల్లల ప్రవర్తన, అలవాట్లలో మార్పులు రావడం మొదలవుతుంది. ఈ వయసులో చాలామంది పిల్లలు తల్లిదండ్రులు మాటలను వ్యతిరేకించడం, లెక్కచేయకపోవడం వంటివి చేస్తుంటారు. వారి మనసులో ఉండే ఆలోచనలు అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. ఈ సమయంలో వారిలో శారీరక మార్పులు కూడా ప్రారంభమవుతాయి. అందుకే ప్రీ టీన్ నుంచి పిల్లలను సరైన దారిలో పెట్టడం పేరెంట్స్ కు పెద్ద సవాల్. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఏదైనా వద్దని చెప్పినా.. కాదని గట్టిగా హెచ్చరించినా.. అది పిల్లలకు తల్లిదండ్రులకు మధ్య దూరాన్ని పెంచుతుంది. ఒకవేళ 10 నుంచి 14 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలు గదిలో ఒంటరిగా రోజంతా గడపడానికి ఇష్టపడుతున్నట్లయితే.. పేరెంట్స్ ఎట్టి పరిస్థితుల్లో ఈ 4 విషయాల ప్రస్తావన తీసుకురాకండి.

**వద్దు అని పదే పదే చెప్తే :** అమ్మాయి లేదా అబ్బాయి ఒక గదిలో ఒంటరిగా కూర్చుని ఉంటే వారిని పదే పదే తనిఖీ చేస్తున్నట్లుగా.. నిఘా ఉంచినట్లుగా ప్రవర్తించి తల్లిదండ్రులు వారికి అంతరాయం కలిగించవద్దు. బదులుగా అవకాశం దొరికినప్పుడల్లా వారితో సాధారణంగా మాట్లాడండి. చదువు గురించి లేదా ఏదైనా విషయాల గురించి చర్చించండి. అంతే తప్ప ఇక్కడ కూర్చోకు.. ఇలా చేయవద్దు.. అని మాత్రం చెప్పకండి. వారిలో మంకుతనం, మొండి పట్టుదల మరింత పెరిగి పెద్దలపై కోపం పెంచుకుంటారు.

**అనుమానం :** పిల్లలు గదిలో ఒంటరిగా కూర్చుని మొబైల్ ఫోన్ చూస్తూ గడుపుతుంటే ఎంతసేపు చూస్తావని గట్టిగా అరవడం.. ఫోన్ లాక్కోవడం లాంటి పనులు తల్లిదండ్రులు అసలు చేయకూడదు. స్క్రీన్ సమయాన్ని గమనిస్తూ ఉండాలి. హఠాత్తుగా ఫోన్ తీసుకున్నట్లుగా కాకుండా ఏదైనా ఒక సాకుతో నెమ్మదిగా బుజ్జగిస్తూ రూం లోంచి బయటికి వచ్చేలా చేయాలి.

**గది మూసివేయవద్దు అని చెప్పకండి :** ప్రైవసీ కోరుకునే చాలామంది పిల్లలు గదిలోకి వెళ్లగానే ఎవరూ లోపలికి రాకుండా లాక్ చేసుకుంటూ ఉంటారు. దీంతో తల్లిదండ్రులకు ఫోన్ తీసుకుని లోపల ఒంటరిగా కూర్చున్న తమ బిడ్డ ఏం చూస్తున్నాడో.. ఎలాంటి పనులు చేస్తున్నాడో అనే ఆదుర్దా ఉండటం సహజం. ఆ ఆరాటంతోనే గది మూసివేయకుండా లోపల కూర్చో అని రిస్ట్రిక్ట్ చేస్తుంటారు. ఇలా చేస్తే పేరెంట్స్ పట్ల పిల్లల్లో నచ్చినట్టుగా ఉండనివ్వట్లేదనే కోపం పెరిగిపోతుంది. సొంత విషయాలు షేర్ చేసుకునేందుకు ఆసక్తి చూపరు. అందుకే డోర్ గడియ పెట్టుకుని లోపలికి వెళ్తే వెళ్లనివ్వండి. కానీ, తరచూ ఏదో ఒక పని కోసం వారి దగ్గరికి వెళ్తూ కంఫర్ట్ గా ఉండనిస్తూనే ఓ కన్నేసి ఉంచండి.

**ఇలా ఎగతాళి చేయకూడదు :** మీ పిల్లవాడు అదే గదిలోనే చదువుకుంటూ, నిద్రపోతూ, ఫోన్ వాడుతూ సమయం గడుపుతుంటే 'నువ్వు రోజంతా ఇక్కడే ఎందుకు కూర్చుంటావు' అని ఎగతాళి చేయకండి. బదులుగా చొరవ తీసుకొని అతన్ని/ఆమెను ఏదైనా సృజనాత్మక పనిపై లేదా డాన్స్, సింగింగ్, గేమ్స్ లాంటి వాటిపై ఆసక్తి కలిగేలా ప్రోత్సహించండి. వాటిని నేర్చుకుని పోటీల్లో పాల్గొనమని చెప్పండి.

# 'విద్యుత్'పై మాట తప్పారు



విద్యుత్ రంగంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైంది. భారాలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను బిగించబోమని ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమయ్యాయి. ప్రజలపై భారాలు మోపడంలో, కార్పొరేట్లకు భూములు దోచిపెట్టేలా కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సాగింది. గత ప్రభుత్వం మోపిన ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ విద్యుత్ భారాలను ప్రతిపక్షంలో ఉండగా టిడిపి తీవ్రంగా వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. 'విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం' అని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచాయి. ఈ మేనిఫెస్టోను ఊరటగా భావించిన ప్రజలు కూటమికి ఎన్నికల్లో పట్టం కట్టారు. కానీ ప్రజల ఆశలను వమ్ము చేస్తూ గత ప్రభుత్వ విధానాలనే కొనసాగించింది. ట్రూ అప్ పేరిట 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు చెందిన రూ.15,484 కోట్ల భారాలను 2024 అక్టోబర్, నవంబర్‌లలో వరుసగా మోపింది. ఇది కాకుండా ప్రతి నెల ఎఫ్‌పిపిసిఎ అంటూ యూనిట్‌కు 40 పైసలు వినియోగదారుల ముక్కుపిండి విద్యుత్ పంపిణీ సంస్థలు వసూలు చేస్తున్నాయి. మూడు ఎఫ్‌పిపిసిఎలు, ఒక ట్రూఅప్‌తో ప్రతి యూనిట్‌కు రూ.1.46 నుంచి 1.65లు అదనంగా చెల్లించాల్సి వస్తోంది.డిమాండ్‌ను బట్టి ఛార్జీల భారం మోపేలా టైమ్ ఆఫ్ డే(టివోడే) విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనివల్ల డిమాండ్ ఉన్న సమయంలో అదనపు భారం వినియోగదారులపై వేయనుంది. అదేవిధంగా పరిశ్రమలకు 6 పైసాలుగా ఉన్న విద్యుత్ సుంకం భారాన్ని వైసిపి ప్రభుత్వం రూపాయికి పెంచుతూ చట్టబద్ధం చేసింది. కూటమి ప్రభుత్వం దానిని మరింత గట్టిపరుస్తూ అసెంబ్లీలో చట్టం తీసుకొచ్చింది.

**స్మార్ట్ మీటర్లపై మాట మార్పు :** స్మార్ట్ మీటర్లపై కూడా కూటమి ప్రభుత్వం మాటమార్చింది. స్మార్ట్‌మీటర్లను పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆ మీటర్లను అన్ని తరగతుల వినియోగదారులకు బిగిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులకు స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లను అమర్చింది. ఈ స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని పలుచోట్ల వినియోగదారులు లబోదిబోమంటున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టులను గత ప్రభుత్వం షీర్డిసాయి ఎలక్ట్రికల్స్‌కు అడ్డగోలుగా కట్టబెట్టిందని టిడిపి ప్రతిపక్షంలో తీవ్ర విమర్శలు చేసింది. అధికారంలోకి వచ్చాక ఆ కంపెనీపై ఒక్క చర్య కూడా తీసుకోలేదు. గత ప్రభుత్వంలో కుదిరిన వివాదాస్పద సెకి ఒప్పందంపై కూడా చర్యలు తీసుకోలేమంటూ రాష్ట్ర ప్రభుత్వం వెనకడుగు వేసింది.

**భూములు అప్పగింత :** పునరుత్పాదక విద్యుత్ పేరుతో ప్రైవేట్ కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం తన భూములను అప్పనంగా అప్పగిస్తోంది. రాష్ట్రప్రభుత్వం క్లీన్ ఎనర్జీ పాలసీ-2024ను విడుదల చేసింది.ఈ పాలసీలో సోలార్ ఉత్పత్తి 78.50 గిగావాట్ల(78,500 మెగావాట్లు)లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ సోలార్ ప్రాజెక్టుల కోసం 3,92,500 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుంది. పవన విద్యుత్‌కు 87,500 ఎకరాల భూమిని సమీకరించాల్సి ఉంటుంది. ఇది కాకుండా 22 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. పునరుత్పాదక విద్యుత్ పేరుతో ఇప్పటికే అదానీ, టాటా, మెఘా వంటి కంపెనీలకు వేల ఎకరాలు అప్పగించింది. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు పెట్టే కంపెనీలే కావాల్సిన చోట భూములు తీసుకునే వెసులుబాటు కూడా కల్పించింది. రైతుల నుంచి తీసుకునే భూములపై 33 ఏళ్లపాటు పూర్తి అధికారాలు కార్పొరేట్లకే ఉంటుంది. ఇప్పటికీ అనేక ఘటనలు ఇందుకు ఉదాహరణగా ఉన్నాయి.

# తాతగారి ఆశయం కోసం..



గర్భాశయం పెగిలిపోయి, లోపల ఉన్న ఐదు నెలల పిండం కిందకి జారిపోతే.. ఏ డాక్టర్ అయినా అది క్లిష్టపరిస్థితి అనే చెబుతారు. కానీ ఓ డాక్టర్ మాత్రం గర్భాశయానికి కుట్లు వేసి, పిండాన్ని బతికించి, బిడ్డ పుట్టే వరకూ ఎంతో జాగ్రత్తగా వైద్యం అందించారు. ఆయనే డాక్టర్ సురక్షిత్ బత్తిన. ఇలాంటి ఎన్నో క్లిష్టమైన ఆపరేషన్లు చేసిన డాక్టర్ సురక్షిత్ ఎవరోకాదు. ఒకప్పటి సినిమా కథానాయకుడు శోభన్‌బాబు మనవడు. ఈ మధ్య ఒక మహిళకు గర్భసంచిలో ఉన్న పెద్ద కణితిని తొలగించి, ఆమె ప్రాణాలను కాపాడి గిన్నిస్‌బుక్ రికార్డుకెక్కారు. ఈ సందర్భంగా ఆయన గురించి కొన్ని విశేషాలు తెలుసుకుందాం. నటభూషణ శోభన్‌బాబు వైవిధ్యమైన పాత్రలు, అనేక సూపర్ హిట్ సినిమాలతో తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేశారు. శోభన్‌బాబు రెండో కూతురు మృదులను, డాక్టర్ శరత్‌కిచ్చి వివాహం చేశారు. వారి కుమారుడే సురక్షిత్. సురక్షిత్ అనే పేరు పెట్టింది శోభన్‌బాబే అని తాజాగా ఒక యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డాక్టర్ సురక్షిత్ తెలిపారు. ఇలా ఎన్నో విషయాలు ప్రేక్షకులతో షేర్ చేసుకున్నారు. శోభన్‌బాబు నటుడిగా ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, సాయంత్రం అయ్యేసరికి చెన్నై వచ్చి, కుటుంబంతో సమయం కేటాయించేవారని, ఆయన నుంచి తాను అదే నేర్చుకున్నానని సురక్షిత్ అన్నారు. సినిమాల్లో నటించాలని దర్శకులు అడిగినా, ఆ ఆఫర్‌ను సురక్షిత్ సున్నితంగా తిరస్కరించినట్లు చెప్పుకొచ్చారు. తనను డాక్టర్‌గా రాణించాలన్నది, వైద్యునిగా ఉన్నతస్థాయికి ఎదగాలనేది శోభన్‌బాబు ఆశయమని, ఆయన చనిపోయే సమయానికి తను ఎంబిబిఎస్ చదువుతున్నట్లు చెప్పారు. శోభన్‌బాబు సినిమాల్లో 'ఏమండీ ఆవిడ వచ్చింది' థియేటర్లో చూసి తాను ఎంజాయ్ చేసినట్లు చెప్పారు.

**తండ్రే ఆదర్శం :** డాక్టర్ సురక్షిత్ తండ్రి డాక్టర్ శరత్ సంతానోత్పత్తి నిపుణులు. 35 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. చెన్నైలోని అపోలో డాక్టర్‌గా పనిచేశారు. తండ్రి బాటలోనే సురక్షిత్ వైద్యరంగంలో ప్రవేశించి, 2005లో చెన్నైలో ఎంబిబిఎస్ పూర్తిచేశారు. 2008లో అన్నామలై యూనివర్శిటీలో గైనకాలజిస్టులో ఎండి పూర్తిచేశారు. మలేషియాలో రోబోటిక్ సర్జన్స్‌లో ఫెలోషిప్ చేశారు. 2013లో సర్టిఫైడ్ రోబోటిక్స్ సర్జన్‌గా పట్టా పొందారు. 2014లో గురుగ్రామ్‌లోని వరల్డ్ లాప్రోస్కోపీ ఆసుపత్రిలో డిప్లొమా చేశారు. 2015లో అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపీ పూర్తిచేశారు. డాక్టర్ రాకేష్ సిన్హా గైనకాలజిస్టు దగ్గర లాప్రోస్కోపి సర్జన్‌గా కొంతకాలం పనిచేశారు. ఆ సమయంలోనే చాలా ఆసుపత్రుల్లో వివిధ రకాల కేసుల్లో, కష్టతరమైన ఆపరేషన్లలో సర్జన్‌గా పనిచేశారు. ఆ తర్వాత చెన్నైలో అపోలో ఆసుపత్రిలో ఓ కన్సల్టెంట్‌గా పనిచేశారు. తండ్రి, కొడుకులిద్దరూ కలిసి ఎన్నో శస్త్రచికిత్సలు చేసి, పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.

**గైనకాలజిస్టుగా ఎందుకు? :** చెన్నైలో 'ఇండిగో ఉమెన్స్ సెంటర్' అనే అత్యాధునిక ఆసుపత్రిని 2015లో ప్రారంభించారు. మహిళల గర్భాశయానికి సంబంధించి ఏదైనా ఇన్ఫెక్షన్లు, సంతాన సమస్యలు, ఐవిఎఫ్, కణుతులు, గర్భాశయ సమస్యలు.. ఇలా అన్నిరకాల వ్యాధులకు సరైన చికిత్స అందించగల వైద్యులుగా సురక్షిత్ సేవలు అందిస్తున్నారు. సర్జన్ అయిన సురక్షిత్ గైనకాలజిస్టుగా సేవలు అందించడం ఏంటీ? అని ప్రశ్నించగా.. 'నేను ఎంబిబిఎస్ చదువుతున్న రోజుల్లో నాకు ఎదురైన అనుభవాలే నన్ను గైనకాలజిస్టుగా మార్చాయి. జనరల్‌గా ఆపరేషన్లు చేయాల్సి వచ్చినప్పుడు.. సర్జన్స్‌ను పిలిపించి, గైనకాలజిస్టులు ఆపరేషన్లు చేయిస్తారు. కానీ సర్జన్స్ వారికి తెలిసిన పద్ధతిలోనే శస్త్రచికిత్సలు చేస్తారు. గైనకాలజిస్టు కోరినట్లు ఆపరేషన్ చాలావరకూ జరగవు. దీనివల్ల పేషెంట్లు చాలా ఇబ్బంది పడుతుంటారు. ఈ విషయాలు నన్ను పదే పదే బాధించేవి. అందుకే ఓ సర్జన్ అయిన నేనే గైనకాలజిస్టు అయ్యి, వైద్యసేవలు అందిస్తున్నా. ఇప్పుడు అన్ని రంగాల్లో మార్పులు వస్తున్నాయి. గైనకాలజిస్టు అంటే ఆడవాళ్లు మాత్రమే చేసే వైద్యంకాదు. పురుషులూ చేయవచ్చు. నా దగ్గరకు వచ్చే చాలామంది మహిళలు "ఈ డాక్టర్ దగ్గరకు వెళితే మా సమస్యలు తీరుతాయి" అనే నమ్మకంతో వస్తున్నారు. ఓపెన్‌గా సిగ్గుపడకుండా తమ సమస్యలను చెబుతున్నారు. నేను వాటిని పరిష్కరించగ లుగుతున్నా. వారి అనుమానాలు నివృత్తి చేసుకుంటున్నారు' అన్నారు.


**కణితిని తొలగించి :** ఖసురక్షిత్ 16 ఏళ్లుగా గైనకాలజిస్టుగా, సర్జన్‌గా పనిచేశారు. ఇన్నేళ్లలో రెండు ఆపరేషన్లు ఆయనకు పెద్ద సవాల్‌గా నిలిచాయి. అప్పుడు ఎంతో చాకచక్యంగా శస్త్రచికిత్సలు చేసి, పేషెంట్లకు మరో జన్మనిచ్చిన సురక్షిత్ సోషల్‌మీడియాలో చాలా చురుకుగా ఉంటారు. గర్భాశయానికి సంబంధించిన అనేక వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ వీడియోలు పోస్టు చేస్తుంటారు. సూచనలు, సలహాలు ఇస్తూ చైతన్యపరుస్తుంటారు. తాజాగా డాక్టర్ సురక్షిత్ బత్తిన వైద్యరంగంలో అరుదైన సర్జరీ చేసి, గిన్నిస్ రికార్డులోకి ఎక్కారు. ఇటీవలే సురక్షిత్ 3డి లాపరోస్కోపీ ద్వారా 4.5 కిలోల భారీ సిస్ట్ ఉన్న గర్భాశయాన్ని తొలగించారు. 2019లో డాక్టర్ సింహా పేరిట ఈ రికార్డు ఉంది. అప్పట్లో ఆయన 4.1 కిలోల గర్భాశయాన్ని లాపరోస్కోపీ శస్త్రచికిత్స ద్వారా తొలగించి, గిన్నిస్ రికార్డుల్లో స్థానం సాధించారు. ఇప్పుడు సురక్షిత్ ఆ రికార్డును బ్రేక్ చేశారు. ఆ సందర్భంగా సురక్షిత్‌ను పలువురు ప్రశంసల జల్లు కురిపించారు.

# టీచరమ్మ..యాక్టరమ్మ



గీతా భాస్కర్.. ఏ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లోనూ శిక్షణ తీసుకోలేదు. ఆమెలోని సహజ నటనే సినిమా అవకాశాలు వెతుక్కుంటూ వచ్చేలా చేసింది. టీచర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే సినిమాల్లో నటిస్తున్నారు. రచయితగా 'డెస్టినీస్ చైల్డ్' అనే పుస్తకం రాశారు. అది చదివిన పాఠకులు 'పుస్తకం అంటే ఇలా ఉండాలి నాయనా!' అని కితాబు ఇచ్చారు. అయినా గీతా భాస్కర్ పెద్ద రచయిత్రి కాదు, పెద్ద నటీ కాదు.. అయినా ఏదైనా ఇట్టే నేర్చుకోగల సామర్థ్యం గీతమ్మ సొంతం. ఇటీవల 'లవ్ యూ నాన్నమ్మ' వెబ్ సీరిస్‌లో నటించి, ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె గురించి కొన్ని విశేషాలు. గీతమ్మ పుట్టి, పెరిగింది చెన్నైలోనే. ఆమె తండ్రి, తల్లివైపు బంధువులంతా చెన్నైలో పెద్ద వ్యాపారస్తులు. ఆమె అమ్మగారివైపు అయితే పూర్తిగా కాస్మోపాలిటన్. గీత తల్లి హార్స్‌రైడ్ చేసేవారు. చెన్నైలో శివాజీ గణేశన్‌లాంటి స్టార్స్ ఉండే మలోని స్ట్రీట్‌లో ఉండేవారు. రాజకీయాలపరంగా గీతకు తల్లి కుటుంబం వైపు బలమైన సంబంధాలు ఉండేవి. ఇక తండ్రి వైపు కుటుంబం ఇందుకు పూర్తిగా భిన్నం. తండ్రి కుటుంబీకులంతా రకరకాల పప్పుల వ్యాపారవేత్తలు. ఎన్నో కట్టుబాట్ల మధ్య గీత పెరిగారు. ఆమెకు ఇద్దరు తోబుట్టువులు. 'మా అమ్మ గారాబంగా పెరిగి వచ్చినా, అత్తగారింట్లో ఎంతో బాధ్యతగా మెసులుకోవడం నాపై ఎంతో ప్రభావం చూపింది!' అని గీత ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. గీతమ్మ చెన్నైలో ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు.



**పెళ్లి తర్వాత :** గీతమ్మ తెలంగాణాకు చెందిన భాస్కర్‌ను వివాహం చేసుకున్నారు. ఆయన ఇంజనీరింగ్ ఉద్యోగం మానుకుని, వ్యాపారరంగంలో స్థిరపడ్డారు. ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. కొడుకు తరుణ్‌ని చదివించేందుకు కూడా గీతమ్మ ఇబ్బందిపడ్డారు. కాలేజీలో ఆర్ట్స్ టీచర్‌గా వర్క్ చేశారు. గీత కవయిత్రి. ఆమె తన జీవితంలో ఎన్నో కవితలు రాశారు. ఆమె రాసిన కవిత ఆధారంగానే తరుణ్‌భాస్కర్ తన తొలి షార్ట్‌ఫిల్మ్ తీసి, అందరి ప్రశంసలు అందుకున్నారు.

**'ఫిదా' చిత్రంతో :** భాస్కర్ దర్శకుడిగా మారేందుకు తల్లి కూడా కారణం. క్రియేటివ్ ఆలోచనలతో కొత్త కథలను రాసుకుంటూ షార్ట్‌ఫిల్మ్స్ తీసేవారు. తాను తీస్తున్న సినిమాలో తల్లిని కూడా భాగం చేసే ప్రయత్నం చేశారు. అందుకు గీత కూడా సహకరించారు. భర్త చనిపోయిన బాధ నుంచి కోలుకుని, కొడుకు కోసం ఓ అడుగు ముందుకు వేశారు. ఆ విధంగా సినిమాల్లో నటించడం ప్రారంభించారు. దర్శకుడు శేఖర్‌కమ్ముల తీసిన 'ఫిదా' సినిమాలో హీరోయిన్‌కి అత్తమ్మ పాత్రలో చాలా సహజంగా నటించారు. తెలంగాణ యాసలో డైలాగ్స్ చాలా స్పష్టంగా చెప్పారు. ఫిదాలో ఆమె నటనను చూసి 'శ్రీరంగ నీతులు', 'సర్కారు వారి పాట', '118,' చిత్రాల్లోనూ తల్లిపాత్రల్లో నటించే అవకాశాలు వచ్చాయి.

**ఊహించని మలుపు :** కొడుకు తరుణ్ భాస్కర్‌ను ప్రోత్సహించే దిశగా చిత్ర పరిశ్రమలోకి గీత 56 ఏళ్ల వయస్సులో ఎంట్రీ ఇచ్చారు. 'అసలు సినిమాల్లో నటిస్తానని అనుకోలేదు. జీవితంలో ఊహించని ఈ మలుపును అంగీకరిస్తూ.. సినిమాలు చేస్తున్నాను. తరుణ్ భాస్కర్ తీసిన "అనుకోకుండా" అనే షార్ట్‌ఫిల్మ్‌లో తల్లి పాత్రలో నటించాను. అక్కడక్కడ ఎమోషనల్ సీన్లలోనూ నటించాను. "ఈ నగరానికి ఏమైంది" లోనూ నటించాను. ఇందుకు నేను ఎక్కడా శిక్షణ తీసుకోలేదు. దర్శకుడిగా తరుణ్ ఎలా డైలాగ్స్ చెప్పాలో చెబుతుండేవాడు.. నేను అలాగే చెప్పేదాన్ని. ఆ సినిమాల్లో సహజంగా ఉండే నా నటనే.. నాకు అవకాశాలు వచ్చేలా చేశాయి..' అని ఓ సందర్భంలో అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానంగా చెప్పారు.

**నానమ్మగా :** ఏప్రిల్ 13న ఆదివారం ఓటీటీలో విడుదల చేసిన షార్ట్‌స్టోరీ 'లవ్ యూ నానమ్మ'.. ఇందులో గీతా భాస్కర్ నానమ్మగా నటించారు. దర్శకుడు శేఖర్ గంగనమోని తెరకెక్కించారు. వయస్సుకు తగ్గ పాత్ర కావడంతో ఈ కథలో నానమ్మగా గీత నటించారు అనేకన్నా, జీవించారు అంటే సరిపోతుంది. ఈ వయస్సులో వృద్ధులకు తన సంతానంతో పాటు మనవరాలు, మనవళ్లతో ఎక్కువ సమయం గడపాలని కోరుకుంటారు. కానీ అయినవాళ్లు ఉన్నా పట్టించుకునే తీరిక, సమయం లేక వృద్ధాశ్రమంలో కాలం వెళ్లదీస్తున్న అమ్మమ్మలు, నానమ్మలు ఎందరో. వారందరి బాధను తన పాత్ర ద్వారా నేటి సమాజానికి తెలియజేశారు గీత. పూర్తి సహజత్వంతో నటించి, ఆ పాత్రకు న్యాయం చేసిన గీతా భాస్కర్‌కు ప్రేక్షకులు అభినందనలు తెలుపుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటున్నారు.

**పూర్తి పేరు : దాస్యం గీతా భాస్కర్**
**నివాసం : హైదరాబాద్**
**భర్త : ఉదయ్ భాస్కర్**
**వృత్తి : టీచర్, నటి, కవయిత్రి.**
**కోడలు : లతా భాస్కర్**

# వ్యవ'సాయం' కొంచెమే



వ్యవసాయానికి రోజుకు 9 గంటల చొప్పున ఉచిత విద్యుత్తు ఇస్తామన్న హామీ రాష్ట్రమంతటా ఒకే రకంగా అమలు కావడంలేదు, స్థూలంగా రోజుకు రెండు దఫాలుగా పగలు 5 గంటలు, రాత్రి 4 గంటల చొప్పున ఇస్తున్నారు. ఎన్నికల్లో టిడిపి కూటమి విజయంలో కీలకమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసారు. కానీ బిజెపి కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన డిజిటల్ అగ్రి మిషన్ (డ్యాం) విధానాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి అదే విధానాన్ని మరోపేరుతో అమలు చేయడం వ్యవసాయ వినాశనానికి దారితీస్తుంది. దళారుల దోపిడిని అరికట్టడానికి ఏపీ మార్కెట్ కమిటీ యాక్ట్ ను పటిష్టంగా అమలు చేస్తామన్న హామీ అమలుకు కనీస ప్రయత్నం జరగలేదు. గతంలాగే రాష్ట్రంలోని ప్రధాన మార్కెట్ లన్నీ దళారుల ఇష్టారాజ్యంగా వున్నాయి. గిట్టుబాటు ధరలు అమలు కాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పొగాకు, మిర్చి రైతుల పరిస్థితి మరింతగా దిగజారింది. గత సంవత్సరం బర్లీ పొగాకు క్వింటాల్ రూ.18,000 లు వుండగా, ఈ సంవత్సరం రూ.6,000 ల నుండి రూ.12,000 లకు పడిపోయింది. వ్యవసాయ ఉత్పత్తులను నిలువ చేసుకునేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తామని, వున్న వాటిని ఆధునీకరిస్తామన్న హామీ అమలు కాలేదు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో వున్న గోడౌన్లను ప్రైవేట్ వారికి లీజుకు ఇచ్చి రైతులకు అన్యాయం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేసింది. తెలుగుదేశం ప్రభుత్వం 2024 -25 ఖరీఫ్ సీజన్‌కు ఉచిత పంటల బీమా అమలు చేస్తామని, ఇప్పటివరకు ఎలాంటి పరిహారం రైతులకు అందించలేదు. 2023 -24 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన పంటల బీమా పరిహారం కూడా రైతులకు అందలేదు. 2024 -25 రబీ సీజన్ నుండి ఉచిత పంటల బీమా స్థానంలో రైతుల వాటా ప్రీమియం రైతులే చెల్లించాలనే విధానాన్ని తీసుకు వచ్చారు. దీనివల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు రైతులు పెట్టుకున్న అర్జీలు సంవత్సరాలుగా పెండింగ్‌లో వున్నాయి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి సరైన చర్యలు తీసుకోలేదు.

PRINTED,PUBLISHED AND OWNED BY NARALA MURALI PRINTED AT SUNDAY PRINTING PRESS, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006.
AND PUBLISHED FROM H NO. 5-212-4, KOTTURU , KANIGIRI, PRAKASAM, ANDHRA PRADESH - 523230 RNI NO : APTEL 2020/80178. CELL : +91 891 934 5606 EDITOR : KUMAR